ఉచిత వైద్య శిబిరం అభినందనీయం

వైద్య శిబిరం ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

- మిర్యాలగూడ ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ, ఫిబ్రవరి 3 : ప్రజా జీవితంలో అత్యంత ప్రామాణికమైన సేవా రంగం వైద్య విభాగమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని మినా మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో రోటరీ గ్లోబల్ విజార్డ్స్, రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ హైదరాబాద్ సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించగా మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా 350 మందికి పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మహ్మద్ అలీ, డైరెక్టర్ షహలాబుతుల్, సుమయబుతుల్, శివశంకర్, సురేన్, వెంకటరాజు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వాణి, వైద్య శిబిరం కో ఆర్డినేటర్ కరుణాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

7 నుంచి పారిశుధ్య డ్రైవ్

- వారం పాటు నిర్వహిస్తాం
- వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

నల్లగొండ, ఫిబ్రవరి 3 : జిల్లా వ్యాప్తంగా 844 గ్రామపంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించినట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. శనివారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలపై రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ హనుమంతరావుతో కలిసి ములుగు జిల్లా నుంచి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా నల్లగొండ నుంచి అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాల్గొని మాట్లాడారు. ఈ నెల 7 నుంచి 15 వరకు ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు. ముఖ్యంగా రానున్న వేసవిలో తాగునీటికి ఇబ్బంది కలుగకుండా ప్రత్యేక దృష్టి పెట్టి 15న గ్రామప్రజలు, మహిళా సంఘాలు, యువకులతో సమావేశం ఏర్పాటు చేసి సామాజిక అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో జడ్పీ సీఈఓ ప్రేమ్ కరణ్‌రెడ్డి, డీఆర్‌డీఓ కాళిందిని, మిషన్ భగీరథ ఎస్ఈ వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఎస్ఈ తిరుపతయ్యతోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సమావేశాన్ని విజయవంతం చేయండి

- మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు

మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ, ఫిబ్రవరి 3 : ఈ నెల 5న పట్టణంలోని నందిపహాడ్ టీఎన్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించే బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కార్యక్రమానికి మాజీ మంత్రులు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. అలాగే నియోజకర్గంలోని సర్పంచ్‌లకు ఆత్మీయ సన్మానం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

కార్యక్రమానికి ఎంపీపీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పట్టభద్రుల ఓటు నమోదును వేగవంతం చేయాలి : ఆర్డీఓ

మిర్యాలగూడ, ఫిబ్రవరి 3 : త్వరలో జరుగనున్న ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు గానూ పట్టభద్రులు ఓటు హక్కు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆర్డీఓ చెన్నయ్య అధికారులను ఆదేశించా రు. శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో తాసీల్దార్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఓటు నమోదు ప్రక్రియ మందకొడిగా సాగుతున్నందున అధికారులు పట్టభద్రుల్లో చైతన్యం కల్పించాలని సూచించారు.

ప్రజలు ప్రత్యేకాధికారులకు సహకరించాలి

సర్పసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మోహన్‌రెడ్డి

- ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి

మర్రిగూడ : సర్పంచ్‌ల పదవీకాలం ముగిసినందున గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ప్రజలు ప్రత్యేకాధికారులకు సహకరించాలని ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి కోరారు. శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేకాధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. జడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ అధికారులు, ఎంపీటీసీలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రశ్నోత్తరాల్లో భాగంగా సభ్యులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. సమావేశంలో తాసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, వైస్ ఎంపీపీ కట్కూరి వెంకటేశ్‌గౌడ్, కో ఆప్షన్ సభ్యుడు యాకూబ్ అలీ, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంపొందించుకోవాలి

- ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

హాలియాలో విద్యార్థులకు బహుమతులను, ప్రసంశపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

హాలియా, ఫిబ్రవరి 3 : విద్యార్థులు మూఢ విశ్వాసాలు వీడి సైన్స్‌పై ఆసక్తి పెంపొందించుకోవాలని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. శనివారం హాలియాలోని టైం స్కూల్‌లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి సైన్స్ సంబురాల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేసి మాట్లాడారు. ఎంతో అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీని ఉపయోగించుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో తిరుమలగిరి(సాగర్) ఎంపీపీ ఆంగోతు భగవాన్‌నాయక్, జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరమణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు విద్యాసాగర్‌రెడ్డి, అమరయ్య, విమల, శ్రీనివాస్, స్కూల్ ప్రిన్సిపాల్ కోటిరెడ్డి, డైరెక్టర్ నరేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నల్లగొండకు కోమటిరెడ్డి చేసింది ఏమీ లేదు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి

నల్లగొండ రూరల్, ఫిబ్రవరి 3 : నల్లగొండ జిల్లాకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసింది ఏమీ లేదని, ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేయలేకపోతే ప్రజలే కాంగ్రెస్‌ను తరిమికొడుతారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ 3 సీట్లకు మాత్రమే పరిమితమవుతుందని పేర్కొన్నారు. ఎస్ఎల్‌బీసీ పనులను త్వరితగతిన పూర్తి చేసి జిల్లాకు తాగు, సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. రైతులకు ఇచ్చిన రైతుభరోసా, రైతు రుణమాఫీ హామీలను విస్మరిస్తే రైతుల పక్షాన పోరాడుతామన్నారు.

పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలి

- డీఈఓ భిక్షపతి

విద్యార్థులకు పాఠం బోధిస్తున్న డీఈఓ భిక్షపతి

కట్టంగూర్, ఫిబ్రవరి 3 : పదో తరగతి విద్యార్థులకు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయాలని డీఈఓ భిక్షపతి ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం మండలంలోని ఈదులూరు, మునుకుంట్ల ఉన్నత పాఠశాలలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులను చదివించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను గ్రూప్‌లుగా విభజించి వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్, వాణి, ఉపాధ్యాయులు ఉన్నారు.

లింగమంతుల స్వామి ఆలయ

- ధర్మకర్తల మండలి ఏర్పాటుకు నోటిఫికేషన్

నిడమనూరు, ఫిబ్రవరి 3 : మండలంలోని ఎర్రబెల్లి లింగమంతుల స్వామి ఆలయ ధర్మకర్తల మండలి ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ దేవాదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ప్రకటన జారీ చేశారు. ఈ నెలలో జాతర జరుగనుండగా పూర్తిచేసిన దరఖాస్తులను డిప్యూటీ కమిషనర్ దేవాదాయ ధర్మాదాయ శాఖ, బొగ్గులకుంట, తిలక్‌రోడ్, హైదరాబాద్, 500001కి గానీ, సహాయ కమిషనర్ దేవాదాయ శాఖ, నల్లగొండకు గానీ పంపాలని సూచించారు. 20 రోజుల్లోగా నిర్దేశిత నమూనాలో దరఖాస్తు చేసుకోవాలని ఆ శాఖ మిర్యాలగూడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఈసం రమేశ్ తెలిపారు.

కేంద్ర బడ్జెట్ ప్రతుల దహనం

చిట్యాల, ఫిబ్రవరి 3 : కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రతులను ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం చిట్యాలలో దహనం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండ శ్రీశైలం మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని ప్రైవేటు రంగానికి కట్టబెట్టాలని చూస్తున్నదని ఆరోపించారు. కేంద్ర బడ్జెట్ పేదలకు ఉపయోగపడే బడ్జెట్ కాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేశ్, అవిశెట్టి శంకరయ్య, అయితరాజు నర్సింహ, జొర్రిగల శ్రీనివాసులు, శీలా రాజయ్య, నారబోయిన శ్రీనివా సులు, కృష్ణయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులకు మతిభ్రమించింది

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గోపాల్‌రెడ్డి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పాశం గోపాల్‌రెడ్డి

గుర్రంపోడు, జనవరి 3 : కాంగ్రెస్ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పాశం గోపాల్‌రెడ్డి విమర్శించారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులు రైతుబంధు డబ్బులు అడిగితే చెప్పులతో కొడతామంటున్న మంత్రులకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన మంత్రులు పిచ్చిపిచ్చిగా మాట్లాడడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు ప్రజలకు క్షమాపణ చెప్పి వెంటనే రైతుభరోసా నిధులు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తరి వెంకటయ్య, కూనూరి సైదిరెడ్డి, వేముల యాదయ్య, మేకల నాగిరెడ్డి, ఇస్మాయిల్, వద్దిరెడ్డి లక్ష్మారెడ్డి, సయ్యద్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

చిట్యాల, ఫిబ్రవరి 3 : మున్సిపాలిటీకి చెందిన బీఆర్ఎస్ నాయకుడు పాల ఊషయ్య ఇటీవల మృతి చెందడంతో గుత్తా వెంకట్‌రెడ్డి చారిట బుల్ ట్రస్ట్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి శనివారం ఊషయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.20వేల ఆర్థిక సాయం అందజేశారు. అలాగే రోడ్డు ప్రమాదంలో గాయపడిన పాల భిక్షాన్ని పరామర్శించి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు, నాయకులు పోలేపల్లి సత్యనారాయణ, పాల సూరయ్య, వేలుపల్లి సందీప్, కుక్కల భిక్షం, చిన్నపాక నాగరాజు, నిస్సార్, గౌస్ ఉన్నారు.

భిక్షాన్ని పరామర్శిస్తున్న గుత్తా అమిత్‌రెడ్డి

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి : ఎంపీడీఓ

మిర్యాలగూడ రూరల్, ఫిబ్రవరి 3 : ప్రజా సమస్యలపై పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలని ఎంపీడీఓ గార్ల పాటి జ్యోతిలక్ష్మి సూచించారు. శనివారం ఆమె యాద్గార్‌పల్లి, కాల్వపల్లి, కాల్వపల్లి తండా గ్రామ పంచాయతీల బాధ్యతలు స్వీకరించిన అనంతరం మాట్లాడారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణ పెరుగాలని సూచించారు. అనంతరం యాద్గార్‌పల్లి పారిశుధ్య కార్మికులను వేతనాలు అందజేశారు. కాల్వపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణా వెనుక జలాల్లో యువకుడు మృతి

నేరేడుగొమ్ము(చందంపేట), ఫిబ్రవరి 3 : స్నేహితులతో కలిసి సరదాగా గడిపేందుకు వచ్చి కృష్ణా వెనుక జలాల్లో మునిగి యువకుడు మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ రాజు తెలిపిన వివరాలు.. హైదరాబాద్‌లోని చంపాపేటకు చెందిన చింతపల్లి పృథ్వీ(20) స్నేహితులతో కలిసి ఆటోలో మండలంలోని వైజాగ్‌కాలనీకి వచ్చారు. కాలనీ సమీపంలోని సాగర్ వెనుక జలాల్లో ఈత కోసం దిగగా ప్రమాదవశాత్తు నీట మునిగిపోయాడు. గమనించిన స్థానికులు బయటికి తీయగా అపస్మారక స్థితిలో ఉండడంతో చికిత్స నిమిత్తం 108లో దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పృథ్వీ మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తాటికల్ పీఏసీఎస్ డైరెక్టర్‌గా సైదులు

నకిరేకల్, ఫిబ్రవరి 3 : తాటికల్ పీఏసీఎస్ డైరెక్టర్‌గా ఓగోడు గ్రామానికి చెందిన బేతరాజు సైదులును సభ్యులు ఎన్నుకున్నట్లు సంఘం సీఈఓ పాదూరి జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆ సంఘం కార్యాలయంలో పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ.. రాచకొండ సునీల్ రాజీనామాతో ఈ ఎన్నిక నిర్వహించినట్లు తెలిపారు. మెజార్టీ సభ్యులు సైదులును ఎన్నుకున్నట్లు చెప్పారు. సంఘం వైస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్‌రావు, డైరెక్టర్లు నకిరేకంటి నరేందర్, బచ్చుపల్లి భుజంగరావు, సామ సత్తిరెడ్డి, నూకల యశోద, బొప్పని సరోజ, జిల్లా నర్సయ్య తదితరులు సైదులును సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

కార్ అద్దాలు పగులగొట్టి రూ.2 లక్షలు చోరీ

మిర్యాలగూడ, ఫిబ్రవరి 3 : కారు అద్దాలు పగులగొట్టి దుండగులు రూ.2లక్షలు చోరీ చేసిన సంఘటన పట్టణంలోని రామచంద్రగూడెంలో శనివారం జరిగింది. టూటౌన్ ఎస్ఐ కృష్ణయ్య తెలిపిన వివరాలు.. రైస్‌మిల్ వ్యాపారి గౌరు శ్రీనివాస్ వేములపల్లిలో బ్యాంక్ నుంచి డబ్బులు డ్రా చేసుకొని తన కారులో పెట్టుకొని మిర్యాలగూడలోని తన ఇంటికి చేరుకున్నాడు. తిరిగి వెంటనే వెళ్లాలనే ఉద్దేశంతో డబ్బుల బ్యాగ్‌ను కారులోనే ఉంచి లాక్ చేసి ఇంట్లోకి వెళ్లాడు. 15 నిమిషాల తరువాత వచ్చి చూడగా కారు అద్దాలు పగిలి ఉన్నాయి. లోపల బ్యాగ్ కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు గ్రహించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి వచ్చి కాలనీలోని ప్రజలను వాకబు చేయగా రెండు బైక్‌లపై నలుగురు వ్యక్తులు అటుగా వెళ్లినట్లు చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యాకూబ్ మృతదేహం లభ్యం

నీలగిరి, జనవరి 3 : పది రోజుల క్రితం పట్టణంలో తప్పిపోయిన విశ్రాంత వార్డెన్ రేపూర్ యాకూబ్(78)మృతదేహం శనివారం లభ్యమైంది. పట్టణ శివారులోని హైటెక్ సిటీ కాలనీ వెనుక భాగంలో మృత దేహాన్ని గుర్తించారు. వార్డెన్‌గా పనిచేసి రిటైర్డ్ అయ్యి అనారోగ్యంతోపాటు మతిస్థిమితం సరిగా లేకపోవడంతో తన కూతురు శారారాణి(డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ సూపరింటెండెంట్)ఇంటి వద్ద ఉంటున్నాడు. గత నెల 25న సాయంత్రం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన యాకూబ్ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కానీ, ఎక్కడా అతని అచూకీ లభించలేదు. శనివారం ఉదయం హైటెక్ సిటీ కాలనీ సెక్యూరిటీ కాలనీ వెనుక బహిర్భూమికి వెళ్లగా దుర్వాసన రావడంతో మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. కుటుంబ సభ్యులు పోలీసులతో కలిసి వచ్చి యాకూబ్‌ను గుర్తుపట్టడంతో అక్కడే పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని వారికి అప్పగించారు. మృతుడి కూతురు శారారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ రావుల నాగరాజు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడిగా నర్సింహ

నీలగిరి, ఫిబ్రవరి 3 : రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడిగా నల్లగొండ జిల్లాకు చెందిన రుద్రాక్షి నర్సింహను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో సంఘం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా నర్సింహా మాట్లాడుతూ.. తన ఎన్నికకు సహకరించిన ప్రముఖ న్యాయవాది, హైకోర్టు పీపీ చలకాని వెంకట్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులు ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలి

మిర్యాలగూడ టౌన్, ఫిబ్రవరి 3 : విద్యార్థులు ఆత్మవిశ్వాసాన్ని పెపొందించుకోవాలని సోషల్ సర్వీస్ డిఫెండర్ హమీద్ షేక్ సూచించారు. తాను నిర్వహిస్తున్న కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకొని యువత, తన మిత్ర బృందం సోషల్ సర్వీస్ కార్యక్రమాలలో పాల్గొనేందుకు ముందుకురావడం అభినందనీయమన్నారు. శనివారం మిర్యాలగూడలోని లిటిల్‌ఫ్లవర్ హైస్కూల్‌లో హైకోర్ట్ న్యాయవాది భరత్‌చంద్ర అభ్యర్థన మేరకు ఆర్థిక సాయంతోపాటు పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, స్టేషనరీ పంపిణీని ప్రిన్సిపాల్ జయరాజన్‌తో కలిసి పంపిణీ చేసి మాట్లాడారు. విద్యార్థులకు మానసిక ఒత్తిడికి లోనుకావద్దని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు ప్రత్యేక నిధులు కేటాయించాలి

చిట్యాల, ఫిబ్రవరి 3 : రాష్ట్ర ప్రభుత్వం కల్లు గీత కార్మికులకు ప్రత్యేక నిధులు కేటాయించాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పానుగుళ్ల అచ్చాలు డిమాండ్ చేశారు. శనివారం చిట్యాలలోని సీపీఐఎం కార్యాలయంలో జరిగిన సంఘం మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గీత కార్మికులకు ఇచ్చే ఎక్స్‌గ్రేషియా నిబంధనల్లో సడలింపులు ఇవ్వాలని కోరారు. సమావేశంలో మామిడి హన్మంతు, గునగంటి కృష్ణయ్య, నకిరేకంటి రాములు, ఊడుగు సత్తయ్య, భిక్షపతి, పానుగుళ్ల వెంకన్న పాల్గొన్నారు.

రోడ్డు నాణ్యత పరిశీలన

మిర్యాలగూడ, ఫిబ్రవరి 3 : మిర్యాలగూడ పట్టణంలో ఇటీవల చేపట్టిన రోడ్డు నిర్మాణాలను ఆర్‌అండ్‌బీ క్వాలిటీ కంట్రోల్ సీఈ సతీశ్ ఆధ్వర్యంలో శనివారం పరిశీలించారు. రాజీవ్‌చౌక్ నుంచి ఏడుకోట్లతండా జంక్షన్ వరకు పలుచోట్ల శాంపిల్స్ సేకరించారు. రెండు వైపులా డ్రైనేజీ నిర్మాణాలతోపాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటామన్నారు.

ఎన్ఎస్పీ ఆఫీస్‌లో మహిళా ఉద్యోగి నిరసన

ఎన్ఎస్పీ డివిజన్-3 కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న పావని

మిర్యాలగూడ టౌన్, ఫిబ్రవరి 3 : తనను పై అధికారులు తీవ్రమైన పని ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆరోపిస్తూ స్థానిక ఎన్ఎస్పీ డివిజన్-3 కార్యాలయంలో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్ పావని అదే కార్యాలయం ఎదుట శనివారం నిరసన చేపట్టింది. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, డీఏఓ లక్ష్మీబాయి, ఈఈ లక్ష్మణ్ తనను తీవ్రమైన పని ఒత్తిడికి గురి చేస్తున్నారని, సీనియర్ అసిస్టెంట్ చేయాల్సిన పనిని సైతం తనకు అప్పగించి ఇబ్బంది పెడుతున్నారని వాపోయింది. ఈ పనులు చేయకపోతే ఉద్యోగాన్ని పర్మినెంట్ చేయమని, సెలవులు కూడా ఇవ్వకుండా ఎస్ఈకి సరెండ్ చేస్తామని బెదిరిస్తున్నారని తెలిపింది. తనకు న్యాయం జరిగేందుకే నిరసనకు దిగినట్లు చెప్పింది. తన సమస్యను పరిష్కరించాలని కోరింది. దీనిపై పై అధికారులను వివరణ కోరేందుకు ఫోన్ చేయగా స్పందించలేదు.

ఇప్పలగూడెంలో వ్యక్తి దారుణ హత్య

- కత్తులతో పొడిచి చంపిన గుర్తుతెలియని వ్యక్తులు

కేతేపల్లి, ఫిబ్రవరి 3 : మండలంలోని ఇప్పలగూడెంలో గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో ఓ వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన వంటెపాక సైదులు(38)సెంట్రింగ్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసవడంతో భార్య కొంతకాలంగా అతడికి దూరంగా ఉంటుంది. ఈ క్రమంలో సైదులు శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకెళ్లి శనివారం ఉదయం గ్రామ శివారులోని మార్కెట్ బండ వద్ద హత్యకు గురై ఉండడాన్ని రైతులు గమనించి స్థానికులకు సమాచారం అందించారు. ఈ విషయం గ్రామంలో దావానంలా వ్యాపించడంతో గ్రామస్తులంతా భయభ్రాంతులకు గురయ్యారు. అక్కడికి చేరుకున్న స్థానికులు రక్తపు మడుగులో ఉన్న సైదులు మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు డాగ్‌స్క్వాడ్‌తో వచ్చి హత్య జరిగిన ప్రదేశం పరిసరాల్లో తనిఖీలు నిర్వహించారు.

రాత్రి 7 గంటల నుంచి 10 గంటల సమయంలో సైదులును గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో పొడిచి చంపినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. సైదులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



దుగినవెల్లి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

కట్టంగూర్, ఫిబ్రవరి 3 : మండలంలోని దుగినవెల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని జరుపుకొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధులుగా విధులు నిర్వర్తించి ప్రతిభ కనబర్చారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మర్రిగూడ : మండల కేంద్రంలోని గాయత్రి స్కూల్‌లో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల విధులు నిర్వహించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పందుల యాదయ్యగౌడ్, ప్రిన్సిపాల్ ఐతగోని పాండు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపటి నుంచి దివ్యాంగుల క్రీడలు

నీలగిరి, ఫిబ్రవరి 3 : అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 5, 6 తేదీల్లో స్థానిక మేకల అభినవ్ స్టేడియంలో దివ్యాంగులకు క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు మహిళా శిశు సంక్షేమ వయోవృద్ధుల శాఖ అధికారి కృష్ణవేణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 5న ఉదయం 9 గంటలకు స్టేడియానికి రావాలని సూచించారు.

క్యాన్సర్‌ను ప్రాథమిక స్థాయిలో గుర్తిస్తే నయం చేయవచ్చు

- ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీహెచ్ పుల్లారావు

నీలగిరి, ఫిబ్రవరి 3 : క్యా